
# ✱ టి.వి.లో పాటలు!! ✱

పిచ్చి పుల్లారావ్ ఢిల్లీలో ఓ ప్రైవేట్ కంపెనీలో పని చేస్తున్నాడు. అతను కంపెనీ పనిమీద హైదరాబాద్ వచ్చి తన చిన్ననాటి స్నేహితుడు వెర్రి వెంగళ్రావ్ యింట్లో దిగాడు. పగటిపూట కంపెనీ పని చూస్కుని సాయంత్రం ఆరున్నర ప్రాంతంలో యింటికి చేరాడు పిచ్చి పుల్లారావ్. అప్పటికే వెర్రి వెంగళ్రావ్ కూడా ఆఫీసునుండి వచ్చేశాడు.




పిచ్చి పుల్లారావ్ మొహం కడుక్కుని వెర్రి వెంగళ్రావ్ భార్య మంగతాయారు ఇచ్చిన వేడి వేడి కాఫీ తాగి సోఫాలో వెర్రి వెంగళ్రావ్ పక్కన రిలాక్స్ అవుతూ కూర్చున్నాడు.

వారి ఎదురుగా టి.వి. ఉంది. కానీ అది ఆన్ చేసిలేదు.

"హబ్బ! ... ఢిల్లీలో అన్నీ హింది ప్రోగ్రాములే చూస్తాం కదా?... అందుకే తెలుగు ప్రోగ్రాముల కోసం మొహం వాచిపోయి ఉన్నాను... టీవీ పెట్టవా చూస్తాను" అన్నాడు పిచ్చి పుల్లారావ్.

వెర్రి వెంగళ్రావ్ నాలుగు సెకనులు వెర్రిగా పిచ్చి పుల్లారావ్ వంక చూశాడు. ఎనిమిది సెకన్లు వెర్రినవ్వులు నవ్వి "టి.వీ యా?... పెట్టాలా?!?..." అంటూ పెదవి విరిచాడు. అంతేగానీ సోఫాలోంచి లేవలేదు.

"మళ్ళీ నేను ఢిల్లీ వెళ్ళాక తెలుగు కార్యక్రమాలు చూడాలని అనుకున్నా చూడలేను... ప్లీజ్ టీ.వీ. పెట్టరా వెంగళ్..." అంటూ వెంగళ్రావ్ చెయ్యి పట్టుకుని వెనక్కి మెలిబెట్టి వీపుమీద గుభీమని ఓ గుద్దుగుద్ది చెంప నిమురుతూ మళ్లీ "ప్లీజ్ ప్లీజ్ ..." అన్నాడు.

ఆ విధంగా చెయ్యి మెలిబెట్టి గుద్దుతూ రిక్వెస్ట్ చేసేవాళ్ళని ఇంతదాకా చూళ్ళేదు వెర్రి వెంగళ్రావ్. అందుకే నోరు తెర్చుకుని ఆశ్చర్యపోయాడు.

"టి.వీ. పెట్టమంటే అలా నోరు తెర్చుకుని వెర్రి మొహం వేస్కుని చూస్తావేం? ... ప్లీజ్, త్వరగా పెట్టవా తెలుగు ప్రోగ్రాంలు చూస్తాను..." అని వెర్రి వెంగళ్రావ్ చెంపమీద చెళ్ మని తగిలించి బ్రతిమలాడాడు పిచ్చి పుల్లారావ్.

ఆ దెబ్బకి వెర్రి వెంగళ్రావ్ చెవుల్లోంచి వెచ్చని ఆవిరి వచ్చింది.

"బాబోయ్... నన్నిహ బ్రతిమాలకు... టీవీ పెడ్తాను... చూసి చావు!!..." అని చెంప రుద్దుకుంటూ గబగబా వెళ్ళి టి.వి. ఆన్ చేశాడు.

అప్పుడు స్క్రీన్ మీద యనౌన్సర్ మొహం పడింది. ఆమె చెవుల్దాకా నవ్వి "ఇప్పుడు పందుల పెంపకం మీద చిన్న డాక్యుమెంటరీ... పందుల సంసారం చూడండి..." అని మళ్ళీ చెవుల్దాకా నవ్వి మాయమైంది.

"హిహి..." అని నవ్వి సోఫా అంచుమీదికి జరిగి టి.వి. వంక కుతూహలంగా చూడసాగాడు పిచ్చి పుల్లారావ్.

మంగతాయారు వంటగదిలో పని పూర్తిచేస్కుని తనుకూడా వచ్చి ఓ కుర్చీలో కూర్చుంది.

కార్యక్రమం అవుతుండగా పుల్లారావ్ దభీమని నేలమీద బోర్లాపడిపోయాడు. వెర్రి వెంగళ్రావ్, మంగతాయారు చాలా కంగారు పడిపోయారు. వెంగళ్రావ్ అతన్ని రెక్క పుచ్చుకుని పైకిలేపి సోఫామీద కూర్చోబెట్టాడు. పందుల సంసారం డాక్యుమెంటరీ అయిపోయింది. మళ్ళీ యనౌన్సర్ మొహం చెవుల్దాకా నవ్వుతూ స్క్రీన్ మీద ప్రత్యక్షం అయ్యింది. "హిహి..." అని నవ్వాడు పిచ్చి పుల్లారావ్.

"ఇప్పుడు పిడకలు సిమ్మెంటుగోడ మీద కొడ్తే శ్రేష్ఠమా లేకపోతే మట్టిగోడల మీద కొడ్తే శ్రేష్ఠమా అన్న విషయం మీద పన్లేని పాపారావు ప్రసంగిస్తారు." మరోసారి చెవుల్దాకా నవ్వి యనౌన్సర్ మొహం మాయమైంది.

పన్లేని పాపారావు ప్రసంగం మొదలయిన రెండు నిమిషాలకి పిచ్చి

పుల్లారావు మళ్లీ ఢమాల్ మని నేలమీద బోర్లాపడిపోయాడు.
వెర్రి వెంగళ్రావు మళ్ళీ అతన్ని రెక్కపుచ్చుకుని పైకిలేపి "నీతో చచ్చే చావొచ్చిందయ్యా... ఎందుకట్టా పడిపోతున్నావ్?" అని అడిగాడు.
"అబ్బే ఏం లేదూ... ప్రోగ్రాంలు చూస్తుంటే కడుపులో తిప్పేసి, వికారం పుట్టేసి ఆ తర్వాత తలతిరిగి అట్టా పడిపోతున్నానన్నమాట ... హిహి!" ఇబ్బందిగా నవ్వుతూ చెప్పాడు పిచ్చి పుల్లారావు.
"ఈ ప్రోగ్రాంలు నీకు కొత్తగానీ... మాకు ఇవి అలవాటే..." అన్నాడు వెర్రి వెంగళ్రావు.
"ఇంక అన్ని ప్రోగ్రాంలూ ఇలాంటివే ఉంటాయా?" బిక్కమొహం వేసి అడిగాడు పిచ్చి పుల్లారావ్.
"అబ్బే ... అన్నీ ఇలాంటివి కావు... దీని తర్వాత ఓ కామెడీ నాటకం ఉంది... భరతనాట్యం అట్టాంటివి కూడా వేస్తుంటారు..." చెప్పాడు వెర్రివెంగళ్రావు.
"అబ్బో... అబ్బో... కామెడీ నాటకమే... అయితే చూద్దాం." హుషారుగా అన్నాడు పిచ్చి పుల్లారావ్.
కాస్సేపయ్యాక ఓ కామెడీ నాటకం మొదలైంది. దాన్ని కాస్త చూసిన పిచ్చి పుల్లారావ్ గుండెలు బాదుకుంటూ నేలమీద పొర్లిపొర్లి ఏడ్చాడు. "టి.వి. కట్టెయ్యండ్రోయ్... నేను ఏడ్వలేక చస్తున్నానుర్రో..." అంటూ గోలెట్టాడు.
"మరేం?... ఇందాక టి.వి. ప్రోగ్రాంలు చూస్తానని నా చెయ్యి మెలేసి వీపుమీద గుద్దావ్?... అయ్యిందా పెళ్ళి!" అంటూ టి.వి. కట్టేశాడు వెర్రి వెంగళ్రావ్.
మంగతాయారు వేడివేడి కాఫీ పట్టుకొచ్చి పిచ్చిపుల్లారావుకి ఇచ్చింది. "వేడివేడి కాఫీ తాగండి... కాస్త సర్దుకుంటుంది." అంది. పిచ్చిపుల్లారావు వేడివేడి కాఫీ తాగి కాస్త రిలాక్స్ అయ్యాడు. మంగతాయారు తనకి వంట గదిలో కాస్త పనుందని లోపలికి వెళ్ళిపోయింది.
కాస్త ప్రాణం కుదుటపడిన పిచ్చి పుల్లారావ్ ఉన్నట్టుండి "హిహిహి..." అని నవ్వాడు.
వెర్రి వెంగళ్రావ్ అతన్ని భయం భయంగా చూశాడు. టి.వి. ప్రోగ్రాంలు చూసి వీడి మతిగానీ భ్రమించలేదు కదా అనుకున్నాడు.
"ఏం లేదు.. మరేమో నాకు బ్లూ ఫిలిం చూడాలని ఉంది... చూపించవా?.." అని అడిగాడు పిచ్చి పుల్లారావ్.

"ఇప్పుడా?... ఎలా కుదుర్తుంది?" అని అన్నాడు వెర్రి వెంగళ్రావ్.

"ఊ... ఊ... నేను బ్లూ ఫిలిం చూడాల్సిందే... చూపించవా?..." అంటూ వెర్రి వెంగళ్రావ్ చేతిని మెలితిప్పి వెనక్కి మడిచి వీపుమీద ఓ గుద్దు గుద్ది "ప్లీజ్!" అన్నాడు పిచ్చి పుల్లారావ్.

వెర్రి వెంగళ్రావు కంగారుపడిపోయాడు.

"నా దగ్గర క్యాసెట్లు లేవు... నా స్నేహితుడి దగ్గర ఉన్నాయి... భోజనాలయ్యాక మనం వాడి యింటికి వెళ్ళి చూద్దాం... వాడు యింట్లో ఒంటరిగా ఉంటాడు కాబట్టి అక్కడైతే కన్వీనియంట్‌గా ఉంటుంది..." చెప్పాడు వెర్రి వెంగళ్రావ్.

పిచ్చి పుల్లారావ్ సరేనంటూ తలూపాడు.

సరిగ్గా అప్పుడే పిచ్చి పుల్లారావ్‌కి ఓ విషయం గుర్తుకొచ్చింది.

"అవునుగానీ టీ.వీలో తెలుగు సినిమా పాటలు రావా?" అడిగాడు వెర్రి వెంగళ్రావ్‌ని.

"ఎందుకు రావూ... ఈరోజు గురువారం కదా... ఈవేళ టీ.వీలో సినిమా పాటల ప్రోగ్రాం చిత్రలహరి ఉంది..." చెప్పాడు వెర్రి వెంగళ్రావ్.

"అయితే మనం సినిమా పాటల ప్రోగ్రాం చూద్దాం..." హుషారుగా అన్నాడు పిచ్చి పుల్లారావు.

వెర్రి వెంగళ్రావు టీ.వీ పెట్టడం కోసం లేచాడు. పిచ్చి పుల్లారావు కంగారుపడిపోయాడు.

"ఉండుండు... అప్పుడే పెట్టకు... ఇంకా కామెడీ నాటకం అయిపోయి ఉండదు... సరిగ్గా పాటల టైముకి పెట్టు" అన్నాడు.

వెర్రి వెంగళ్రావు ఒక అయిదు నిముషాలకి సరిగ్గా పాటల టైముకి టి.వి. పెట్టాడు. అదే టైముకి వంటగదిలోని పని పూర్తి చేసుకుని మంగతాయారు కూడా వచ్చింది.

టీ.వీలో మొదటగా భక్తభంజనీదేవి చిత్రంలోని భక్తిపాట వచ్చింది.

పిచ్చి పుల్లారావ్ ఆ పాట విని మహదానందం చెందాడు.

"ఆహా... టి.వి. వాళ్ళకి ఏం భక్తి ఏం భక్తి... చాలా మంచివారు మీ ఊరి టి.వి. వాళ్ళు" అన్నాడు.

మంగతాయారూ, వెర్రి వెంగళ్రావూ ఇద్దరూ మొహమొహాలు చూసుకుని కిసుక్కున నవ్వారు.

తర్వాతి పాట "ఖైదీలో ఖైదీ" లోది. "వేడిగాలి కొట్టిందమో..." అంది హీరోయిన్ కాళ్ళు బారచాపి మూలుగుతూ.

"యేడా? యేడా? యేడా?" అంటూ స్టెప్పులేశాడు హీరో...
"ఆడనే కొట్టిందిరా మావా...
నువ్వు సూది పొడుస్తే తగ్గుద్దిరా మావా...
పాటంతా విన్న పిచ్చి పుల్లారావ్ మొహం ఎర్రగా కందిపోయింధి. పక్కకి తిరిగి చూస్తే వెర్రి వెంగళ్రావ్ మొహం కూడా ఎర్రగా కందిపోయి ఉంది. ఈ పక్కకి చూస్తే మంగతాయారు నెత్తి మొహం మీద గుడ్డ కప్పుకుని ఉంది.
"అదేమిటి... మొహంమీద గుడ్డ కప్పుకుంది మీ ఆవిడ?" అని ఆశ్చర్యంగా అడిగాడు పిచ్చి పుల్లారావు.
"సినిమా పాటల కార్యక్రమం కదా?... సిగ్గుతో చచ్చిపోతూ మొహానికి అలా గుడ్డ కప్పుకుందన్న మాట!" చెప్పాడు వెర్రి వెంగళ్రావ్.
పిచ్చి పుల్లారావు టి.వి. వంక చూశాడు. అప్పుడు "పచ్చి రౌడీ" సినిమాలో పాట వస్తుంది.
హీరోయిన్ చిన్న చెడ్డీ వేస్కుని డాన్స్ చేస్తూ పాటందుకుంది.
"ఎక్కడో ఏదో కుట్టింది...
నువ్వొచ్చి మందేస్తే తగ్గుద్ది..."
అప్పుడు హీరో హీరోయిన్ పిర్రమీద తన్ని తనూ పాటందుకున్నాడు.
"మందేస్తా... మందేస్తా
నీ వంటికి రాసేస్తా
పక్కేస్తే కిందామీదా ఊపేస్తా..."
"ఛీఛీఛీ... " అంటూ సిగ్గుతో చచ్చిపోతూ మంగతాయారు లోపలికి పరుగుతీసింది.
"ఒక్..."అంటూ పిచ్చి పుల్లారావు వాంతి చేస్కున్నాడు.
ఇంకా అలాంటి పచ్చి బూతుపాటలు టి.విలో మరో నాలుగు వచ్చాయి. పాటలు అయిన తర్వాత భోజనాల దగ్గర కూర్చున్నారుగానీ ముగ్గుర్లో ఎవరూ సరిగ్గా అన్నం తినలేకపోయారు....
కడుపులో తిప్పేస్తున్నట్టు ఏదో ఇదిగా ఉంది ముగ్గురికీ.
భోజనాలు అయింతర్వాత వెర్రి వెంగళ్రావ్ పిచ్చి పుల్లారావుని అడిగాడు:
"మనం ఇంక మా ఫ్రండింటికి బయల్దేరదామా?"
"ఎందుకూ?..." ఆశ్చర్యంగా అడిగాడు పిచ్చిపుల్లారావు.
"ఎందుకేమిటి? ... నువ్వు బ్లూ ఫిలిం చూడాలని అన్నావుగా?"

"ఈవాళ్టికి ఆ అవసరం లేదులే... ఇప్పుడే టి.వి.లో తెలుగు సినిమాపాటలు చూశాంగా... అవి బ్లూ ఫిలింకంటే ఘాటుగా ఉన్నాయ్..." అన్నాడు పిచ్చి పుల్లారావు.
వెర్రి వెంగళ్రావ్ నోరెళ్ళబెట్టాడు.

***

(సెన్సార్ వాళ్ళకి మతిలేక అలాంటి పాటలున్నా సినిమా వాళ్ళకి సర్టిఫికెట్ ఇస్తున్నారు. వాళ్ళకి బుద్ధిలేకపోతే టి.వి. వాళ్ళకయినా ఉండక్కర్లేదా? టి.వి.లో పని చేసేవాళ్ళు వాళ్ళింట్లో వాళ్ళ అమ్మని ఒక పక్క, చెల్లిని మరో పక్క కూర్చోబెట్టుకుని చిత్రలహరి కార్యక్రమం చూస్తే బాగుంటుంది. ఫోన్లు చేసి చెప్పినా, పత్రికల్లో ఉత్తరాలు ప్రచురించినా వాళ్ళు వినరు. అందుకే నేను డైరక్టర్ జనరల్ కి, హైదరాబాద్ దూరదర్శన్ మీద కంప్లైంట్ ఇస్తూ ఉత్తరం రాశాను. ఆ ఎడ్రసు:
డైరెక్టర్ జనరల్,
దూరదర్శన్ కేంద్ర,
మండి హౌస్,
న్యూఢిల్లీ.
మీరు కూడా ఈ అడ్రసుకి బూతుపాటల మీద కంప్లైంట్ ఇస్తూ ఉత్తరాలు రాస్తే మంచిది. అప్పుడైనా మనకీ బూతు పాటల బాధ తప్పుతుందేమో!

– రచయిత.

* * *